www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 21 జూలై 2024 5 కాకినాడ



పైడాలో సినీ సందడి


సందడి చేస్తున్న విరాజి చిత్ర బృందం

ప్రజాశక్తి - తాళ్లరేవు

పైడా విద్యా సంస్థల్లో శనివారం సినీ కళాకారులు సందడి చేశారు. ఈ సందర్భంగా విరాజి చిత్ర బృందం పైడా కళాశాలను సందర్శించి విద్యార్థులతో స్టెప్పులు వేశారు. సినీ యాక్టర్లు రావడంతో కళాశాల లో విద్యార్థుల మధ్య ఉత్సాహం వెల్లువిరిసింది. హీరో వరుణ్ సందేశ్, హీరోయిన్ షాలిని డైరెక్టర్ ఆద్యన్త హర్ష ప్రొడ్యూసర్ మహేంద్ర నాథ్, కాలేజ్ జాయింట్ సెక్రెటరీ నిత్య శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన జన జీవనం

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు
- భారీగా వీస్తున్న ఈదురుగాలులు
- ఆదిలోనే కష్టాల్లో కర్షకులు
- మెట్ట ప్రాంతానికి మేలు చేస్తున్న వానలు


సామర్లకోట మండలం వికె రాయపురంలో నీటమునిగిన వరి పొలాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన జనజీవనం పూర్తిగా స్తంభించింది. ఉదయం నుంచి రాత్రి వరకు కుండపోత వర్షం పడుతూ ఉండటంతో బయటకు కదలలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. అత్యవసరమైతే తప్ప అనేకమంది ఇళ్లకే పరిమితం అవుతున్నారు. కోటనందూరు మండలంలో అత్యధికంగా 67.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా 12.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అడుగు బయటకు పెట్టేందుకు వీలు కూడా లేకపోవడంతో అనేక వ్యాపారాలు గత మూడు రోజులుగా వెలవెలబోతున్నాయి. చిరు వ్యాపారులకు ఉపాధి కరువైంది. ఏ రోజుకి ఆ రోజు వ్యాపారాలు సాగితేనే పూట గడిచే పరిస్థితి ఉన్న సామాన్యులకు చిక్కులు వచ్చి పడ్డాయి. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకం పనులూ నిలిచిపోయాయి. భారీ వర్షాలకు తోడు శనివారం ఈదురు గాలులు బలంగా వీచాయి. దీంతో పలుచోట్ల చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయి. వృక్షాలు నేలకొరగడంతో వాహన రాకపోకలకు ఆటంకాలు ఏర్పడ్డాయి.

పెట్టుబడి పోతుందేమోనన్న భయం

ఈ ఏడాది వాతావరణం అనుకూలించిందనుకుంటున్న తరుణంలో అన్నదాతలకు ఆదిలోనే కష్టాలు వచ్చి పడ్డాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పొలాలను పూర్తిగా ముంచెత్తింది. గత మూడు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో నారు మడులు, నాట్లు వేసిన పొలాలు ముంపు భారిన పడడంతో నష్టం తప్పేలా లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మడుల్లో నీటిని బయటకు తీసి నారును రక్షించుకునేందుకు వారు పడరాని పాట్లు పడుతున్నారు. సుమారు 200 ఎకరాల్లో నారు మడులు ముంపునకు గురయ్యాయి. సుమారు 4 వేల ఎకరాల్లో ఎదజల్లు పంట నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడి నష్టపోతామన్న ఆందోళన అన్నదాతల్లో నెలకొంది. ప్రస్తుతం రైతులు జిల్లా వ్యాప్తంగా సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు వరి నారు మళ్లు పోసుకుంటుంటే మరి కొందరు వెదజల్లే పద్ధతిలో నాట్లు వేస్తున్నారు. వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో తీరం వెంబడి గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి.

3.10 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు

జిల్లాలో ఈ ఏడాది 3.10 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎక్కువ మంది ఎంటియు 1064, 1075, 1061, 1121, 1156, ఆర్జిఎల్ 2537, బిపిటి 5204, ఎంటియు స్వర్ణ 7029 రకాలను సాగుకు వేశారు. ఇప్పటి వరకు సుమారు 50 వేల ఎకరాల్లో నాట్లు, ఎదజల్లు పద్ధతిలో నాట్లు పడ్డాయి. సాధారణంగా 25 నుంచి 30 రోజుల్లో నారు తయారు అవుతుంది. నారుకు సిద్ధమవుతున్న తరుణంలో భారీ వర్షాలు అన్నదాతల ఆశలను నాశనం చేస్తున్నాయి.

యంత్రాంగం అప్రమత్తం

జిల్లాలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఇప్పటికే అలర్ట్ అయ్యింది. దీనిలో భాగంగా ప్రతికూల వాతావరణం ఉన్నందున పిల్లల భద్రత దృష్ట్యా కలెక్టర్ శనివారం పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించారు. గర్భిణీ, బాలింతలు, పిల్లలు ఇబ్బంది పడకుండా వారి అవసరాలను అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అందుబాటులో ఉండి చూసుకోవాలని ఆదేశించారు. కాకినాడ నగరంలో ఎక్కడ వర్షపు నీరు నిలవ ఉండకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకట్రావు తెలిపారు. శనివారం ఆయన నగరంలో అనేక ప్రాంతాల్లో పర్యటించారు.

మెట్ట పంటలకు మేలు

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గం పరిధిలోని పలువురు రైతులు వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు మెట్ట పంటలకు మేలు చేస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరిని సాగు చేసేందుకు వీలుగా నారుమడులను కూడా సిద్ధం చేసుకుంటున్నారు.

జిల్లాలో 772.2 మిల్లీమీటర్ల వర్షపాతం

గత 24 గంటల్లో జిల్లాలో 36.8 మి.మీ సరాసరితో 772.2 మి. మీ వర్షపాతం నమోదయింది. కోటనందూరు మండలంలో అత్యధికంగా 67.6 మి.మీ వర్షపాతం నమోదు కాగా కరప మండలంలో అత్యల్పంగా 12.6 మి.మీ వర్షపాతం నమోదయింది.

నీట మునిగిన పంటపొలాలు

ప్రజాశక్తి - సామర్లకోట

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు ప్రాంతాల్లో పంటపొలాలు నీట మునిగాయి. వరద జలాలు భారీగా వచ్చి చేరుకోవడంతో ఏలేరు, గోదావరి కాలువలకు వరద నీటి ప్రవాహం పెరిగింది. లోతట్టు ప్రాంతాలోని పలు గ్రామాల్లో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. మండల పరిధిలో ఇప్పటి వరకు 30 హెక్టార్లలో వెదజల్లే పద్ధతిలోనూ, అయిదు హెక్టార్లలో నాట్లు ద్వారా నాటు జరిగిన పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. మండలంలోని వేట్లపాలెం, జి.మేడపాడు, వికె రాయపురం, ఉండూరు, అచ్చంపేట, వల్లూరు, నవర, చంద్రంపాలెం వంటి గ్రామాల్లో పంట పొలాలు నీట మునగడంతో పొలాలు పెద్ద పెద్ద చెరువులుగా కన్పిస్తున్నాయి. సామర్లకోట, జి.రాగంపేట జగనన్న కాలనీ వర్షపు నీటి ముంపునకు గురి అయ్యి కాలనీ వాసులు రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, జెసి రామ్‌సుందర్ రెడ్డి

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి, పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అంశాలపై జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి సమీక్షా సమావేశం జరిగింది. డంపింగ్ యార్డ్, పరి శ్రమలు, శ్మశాన వాటికలకు అవసరమైన భూమి గుర్తింపు, సేకరణ, మ్యూటేషన్, కుల ధృవీకరణ పత్రాలు, సిసిఆర్‌సి కార్డుల మంజూరు, పౌర సరఫరాల శాఖకు సంబంధించి ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు సరుకుల పంపిణీ వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూకు సంబంధించి ప్రతి అంశం పైన ప్రత్యేక దృష్టి పెట్టి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో డంపింగ్ యార్డ్, పరిశ్రమల స్థాపన, శ్మశాన వాటికలకు అవసరమైన భూ సేకరణ పనులు చేపట్టాలన్నారు. తహశీల్దార్ పరిధిలో మ్యూటేషన్ నిమిత్తం అందిన దరఖాస్తులను తప్పనిసరిగా గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. నిర్ధిష్టమైన, ఖచ్చితమైన కారణాలు లేకుండా దరఖాస్తులు తిరస్కరించడానికి వీలులేదని స్పష్టం చేశారు. కౌలు రైతు పత్రాలు మంజూరు ప్రక్రియ వేగవంతం చేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలన్నారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు నిత్యవసర సరుకులు సకాలంలో పంపిణీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒలు ఇట్ల కిషోర్, జె. సీతారామరావు, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ బి.బాలసరస్వతి, తహశీల్దార్లు పాల్గొన్నారు.

తక్షణమే పెట్టుబడి సాయాన్ని అందించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు తక్షణమే పెట్టుబడి సాయంగా రూ.20 వేలను అందించాలని ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు కోరారు. శనివారం కలెక్టర్ షాన్ మోహన్‌ను కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు, వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కె.సింహాచలం, రైతు సంఘం జిల్లా నాయకులు వాసంశెట్టి చంద్రరావు తదితరులు కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు, కౌలు రైతులు పెట్టుబడుల కోసం ప్రయివేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడుతున్నారని అన్నారు. కావున ఎన్నికల హామీలో భాగమైన పెట్టుబడి సాయం రూ.20 వేలను తక్షణమే రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భూయజమానితో నిమిత్తం లేకుండా కౌలు రైతులందరికీ ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకు రుణాలు ఇప్పించాలని, గత మే, జూన్ నెలలో చేసిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన బకాయాలను కూలీలకు విడుదల చేయాలని కోరారు.


చాంబర్ ప్రతినిధికి వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

సర్వే అండ్ టాలీ వర్కర్లకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ డీప్ వాటర్ ఎంకరేజ్ పోర్ట్‌లో గత 30 ఏళ్ల పైబడి పనిచేస్తున్న సర్వే అండ్ టాలీ కార్మికులకు జీతాలు పెంచాలని, కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాన్ని కల్పించాలని పోర్ట్ సర్వే అండ్ టాలీ కార్మికుల యూనియన్ డిమాండ్ చేసింది. శనివారం సిఐటియు కాకినాడ నగర కన్వీనర్ మలకా వెంకట రమణ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులకు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ సంవత్సరాల తరబడి సర్వే అండ్ టాలీ కార్మికులుగా పనిచేస్తున్న వర్కర్లకు ఏ విధమైన సౌకర్యాలు అందడం లేదని, వారికి ఇచ్చే వేతనం కూడా రోజువారి కూలి రూ.300 మాత్రమే ఇస్తున్నారని అన్నారు. దీనిని వెయ్యి రూపాయలకు పెంపుదల చేయాలని కోరారు. కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని, సర్వే అండ్ టాలీ పని స్థానికులకే చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, పని ప్రదేశంలో షెడ్లు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ సర్వే అండ్ టాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.సూర్యారావు, పి.కుమార్ స్వామి, పాలిక రాజేంద్రప్రసాద్, కె.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభోత్సవం చేస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా పేదలకు వైద్యం

ప్రజాశక్తి - గండేపల్లి

ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా నిరుపేదలకు వైద్యం అందుబాటులోకి రానుందని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. శనివారం మండలంలోని నీలాద్రిరావుపేట శివారున ఉన్న కార్తికేయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఎన్‌టిఆర్ వైద్య సేవలను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సతీమణి జ్యోతుల లక్ష్మీదేవి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ పేదవారు అధికంగా ఉండే మెట్ట ప్రాంతంలో రెండు హాస్పిటల్స్‌లో ఎన్‌టిఆర్ వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. హాస్పిటల్‌లో గైనకాలజీ, పిడియాట్రిక్, సాధారణ వ్యాధుల చికిత్స, పోలిట్రామా, ఆర్థోపెడిక్ వంటి వ్యాధులకు ఆరోగ్యశ్రీ కల్పించి పేదలకు ఉచిత వైద్యం అందిస్తూ డాక్టర్ అవినాష్ ప్రజల మెప్పును పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోర్పు లచ్చయ్య దొర, ఆస్పత్రి ఎండి కుళ్ళ వెంకటరమణ, ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, సర్పంచ్ ములంపాక సురేష్, కార్యదర్శి తరంగిణి, జాస్తి వసంత్, అడబాల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థల దాత అప్పారావు మృతి



ప్రజాశక్తి - తాళ్ళరేవు

గ్రామానికి అవసరమైన స్మశాన వాటిక కోసం దానం చేసిన స్థలంలోనే దాతను దహనం చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. మండలానికి చెందిన పటవల గ్రామంలోని శెట్టిబలిజ పేటకు స్మశాన వాటిక లేకపోవడంతో గ్రామానికి చెందిన దంగేటి వెంకటరమణ, దంగేటి అప్పారావులు సుమారు రూ.15 లక్షల విలువైన భూమిని గ్రామానికి వారి తల్లీదండ్రుల జ్ఞాపకార్థం దానం చేశారు. ఆ స్థలాన్ని బాగుచేసి ఇటీవల కాలంలోనే గ్రామానికి అప్పగించారు. అయితే స్థల దాతల్లో ఒకరైన అప్పారావు శుక్రవారం మృతి చెందారు. దానం చేసిన స్థలంలోనే దహనం చేయడం బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థలాన్ని ఇచ్చిన దాతలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదిత్యలో అంతర్జాతీయ చదరంగ దినోత్సవం


విజేతలతో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ చదరంగ దినోత్సవం నిర్వహించారు. శనివారం ప్రపంచ వ్యాప్తంగా .జరుగుతున్న చెస్ ఈవెంట్ కార్యక్రమంలో భాగంగా ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చదరంగం పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మహిళా భాగంలో ఎం.నిర్మల, బి.నిత్య సంతోషి, పురుషుల విభాగంలో డి.దివాకర్, ఎన్ సద్గురుస్వామి వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడలు జీవితంలో ఒక భాగం కావాలని, చదరంగం మానసిక సామర్థ్యాన్ని పెంచే ఆట అని అన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతోపాటు ఆటలకు ప్రత్యేక ప్రాధాన్యం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విభాగాన్ని ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల కార్యదర్శి డాక్టర్ నల్లమిల్లి సుగుణరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, దివాకర్ రావు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అనపర్తి ఎంఎల్ఎ


కలెక్టర్‌కు మొక్కను ఇస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కాకినాడ

అనపర్తి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెదపూడి మండలానికి సంబంధించి భారీ వర్షాలు, తుపానుల సందర్భాల్లో పంట పొలాలు ముంపుకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. డ్రెయినేజీలు, ఇరిగేషన్ కాలువల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

రూ .1.49 లక్షల ఆదాయం


యాత్రికులకు అన్నదానం చేస్తున్న నిర్వహకులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలానికి చెందిన తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.1.49 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాస్ తెలిపారు. వివిధ దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1,07,020, అన్నదాన విరాళాల ద్వారా రూ.27,886, కేశఖండన ద్వారా రూ.3,440, తులాభారం ద్వారా రూ.150, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.10,800 ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు సహాయ సహకారాలు అందజేశారన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తా: ఎంఎల్ఎ


విద్యార్థులకు కిట్స్‌ను అందచేస్తున్న ఎంఎల్ఎ నానాజీ

ప్రజాశక్తి - కరప

నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఎంఎల్ఎ పంతం నానాజీ అన్నారు. శనివారం స్థానిక చిరంజీవి కళ్యాణ మండపంలో ఎంఇఒలు కె.కృష్ణవేణి, పి.సత్యనారాయణ అధ్యక్షతన విద్యార్థులకు కిట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయుల కొరత తదితర అంశాలపై దృష్టి సారిస్తానని అన్నారు. అధికారులు, ఇతర ప్రజాప్రతినిధుల సూచనల మేరకు విద్యాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆయనను గజమాలతో సత్కరించారు. తొలిసారిగా గ్రామానికి వచ్చిన ఆయన తొలుత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పి.శ్రీలక్ష్మి, జడ్‌పిటిసి వై.సుబ్బారావు, సర్పంచ్ సాదె ఆశాజ్యోతి, భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, బండారు మురళి, తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన ఏలేరు నీటిమట్టం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

బంగాళాఖాతంలో తుఫాను ప్రభావంతో ఏజెన్సీ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఏలేరు రిజర్వాయర్ నీటిమట్టం స్వల్పంగా పెరుగుతుంది. రిజర్వాయర్ సామర్థ్యం 86.56 మీటర్లు కాగా ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం 73.40 మీటర్లకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. పరివాహక ప్రాంతం నుంచి 4027 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఎడమ కాలువ ద్వారా 190 క్యూసెక్కులు, తిమ్మరాజు చెరువుకు 50 క్యూసెక్కులను నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో నీటి విడుదలను నిలిపి వేశారు.

ములగపూడిలో ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - రౌతులపూడి


మండలంలోని ములగపూడి గ్రామంలో నల్లరాతి క్వారీ తవ్వకాలపై శనివారం ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ లీజు దారు మౌలిక సదుపాయాలు కల్పన, రహదారుల నిర్మాణం, వైద్య సేవలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా నిర్వహకులు ప్రభుత్వ నిబంధనలు లోబడి తవ్వకాలు చేపట్టడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పనకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ డిఆర్ఒ కె.శ్రీరమణి మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను నివేదిక రూపంలో జిల్లా ఉన్నతాధికారులకు అందచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ సందీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర శిబిరం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పెద్దబజార్ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నేడు ఉచిత నేత్ర వైద్య శిభిరం నిర్వహిస్తున్నట్టు సుమిత్ కుమార్ జైన్, అమిత్ కుమార్ జైన్ చెప్పారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శాంతి బ్యాంకర్స్ ఆధ్వర్యంలో తమ తండ్రి భవర్ లాల్ డి జైన్ 18 ఏళ్ళ క్రితం ప్రారంభించిన ఉచిత నేత్ర శిభిరాన్ని ఆయన జ్ఞాపకార్థం ప్రతియేటా కొనసాగిస్తున్నట్టు చెప్పారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి సహకారంతో ఈ ఏడాది 18వ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ శిబిరం కొనసాగుతుందన్నారు. శిబిరానికి హాజరయ్యే ప్రజలు ఆధార్ కార్డు లేదా తెల్ల రేషన్ కార్డులతో రావాలని తెలిపారు.

కార్టూ'నిజం'



కుటుంబ జీవన ప్రమాణాల మెరుగుదల


సమావేశంలో మాట్లాడుతున్న సెర్ఫ్ అడిషనల్ డైరెక్టర్ సత్యభామ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మహిళల స్వయం నిర్ణయాధికారంతో కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు జాతీయ జీవనోపాదుల అభివృద్ధి మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) ప్రాజెక్టు దోహదం చేస్తుందని సెర్ఫ్ అడిషనల్ డైరెక్టర్ ఎన్.సత్యభామ అన్నారు. శనివారం మండలంలోని కోరంగిలో గోదావరి మహా సమాఖ్య (జి.ఎంఎస్) లో రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం ప్రారంభం అయింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమ్యూనిటీ నిర్వహణ శిక్షణ కేంద్రాల ఏర్పాటు, నిర్వహణపై 16 జిల్లాల డిపిఎం, ఐబి, ఎపిఎం, మండల సమాఖ్యల కార్యనిర్వాహక సభ్యులకు 3 రోజులపాటు రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు ఈ శిక్షణ జరిగిందని అన్నారు. మహిళా సంఘాలు స్వయంగా తమ కార్యకలాపాలు నిర్వహించుకునేలా శిక్షణ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిపి బాబూరావు, కె.మోహన్, కె.నరేష్, ఎంవివి.లక్ష్మి, జిఎంఎస్ అధ్యక్షురాలు బొమ్మిడి వెంకటలక్ష్మి, కోసాధికారి కొల్లు నాగ సులోచన, తదితరులు పాల్గొన్నారు.

మైనర్ డ్రెయిన్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలి


మునిగిపోయిన పంటపొలాలను పరిశీలిస్తున్న వల్లు రాజబాబు

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలో మైనర్ డ్రెయిన్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి, తక్షణమే పనులను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని జిల్లా కౌలు రైతుల సంఘం కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఆర్యవటం, గొల్లపాలెం, చేదువాడ, కాజులూరు, దుగ్గుదూరు, కుయ్యేరు, ఉప్పిమిల్లి గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ మండలంలో మూడు ప్రధాన డ్రెయిన్లను ఆనుకుని ఉన్న అక్కిరేవు, కూరాడ, బండిరేవు, టేకి, ఉప్పుమిల్లి డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఇటీవల కురిసిన వర్షపు నీరు పల్లపు చేలను ముంచేస్తున్నాయని అన్నారు. పంటకాలవల్లో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో ముంపు సమస్య తీవ్రంగా ఉందన్నారు. కోలంక పంటకాలవలో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో రైతులు సాగు చేసేందుకు వెనుకాడుతున్నారు. ఇప్పటికే వెదజల్లిన పంట చేలల్లో నీరు నిలిచిపోవడంతో రైతులు, కౌలు రైతులకు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకుందని అన్నారు. వెంటనే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నిధులు మంజూరు చేసి డ్రెయిన్లను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర గ్రామానికి చెందిన నున్నా నరేష్ (38) హత్య కేసులో అయిదుగురు నిందితులను శనివారం అంగర పోలీసులు అరెస్టు చేశారు. అంగర పోలీస్ స్టేషన్‌లో నిందితుల వివరాలను మండపేట రూరల్ సీఐ శ్రీధర్ వెల్లడించారు. గ్రామానికి చెందిన నరేష్ మతిస్థిమితం లేక గ్రామస్తులతో తరచూ గొడవలు పడుతుండేవాడు. తన నివాస సమీపంలోని నిందితుడైన గుత్తుల పోతురాజు తండ్రితో నరేష్ గొడవ పడ్డాడు. దీంతో ఆగ్రహం చెందిన పోతురాజు మిగిలిన నలుగురు నిందితులైన నెల్లి శ్రీను, కోనాల రాంబాబు, మాతా శ్రీను, దాయం రాంబాబుల సాయంతో ఈ నెల 15న నరేష్‌ను సెంట్రింగ్‌రాడ్, కర్రలతో కొట్టి చంపారు. మరుసటి రోజు చనిపోయి ఉన్న నరేష్ మతదేహానికి బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనలో అయిదుగురు నిందితులపై హత్య కేసు నమోదు చేసి ఆలమూరు జె ఫ్‌సిఎం కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి వారికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సిఐ శ్రీధర్, అంగర ఎస్ఐ పరదేశి తెలిపారు .పోలీసులకు సమాచారం తెలపకుండా అంత్యక్రియలు నిర్వహించి బంధువులపై కూడా కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని గ్రామాలలో శనివారం ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తన సిబ్బందితో పేకాట శిబిరాలపై విస్తత దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఉచ్చిలి గ్రామ శివారున పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,100 స్వాధీన పరుచుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - కడియం

మండలంలోని మాధవరాయుడుపాలెంలో కూల్ డ్రింక్ సీసా బద్దలు కొట్టి ఒకరిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సౌత్ జోన్ డిఎస్‌పి ఎం.అంబికా ప్రసాద్ తెలిపారు. ఈ నెల 18వ తేదీ రాత్రి అదే గ్రామానికి చెందిన ముంజేటి సురేష్ మద్యం తాగిన బాటిల్‌ను సెంటర్లో రోడ్డుపై పగలగొట్టడంతో అక్కడ ఉన్న పెద్దలు వారించారు. దీంతో ధనుంజయ రాజుపై సురేష్ దాడి చేయడంతో తీవ్ర గాయాలైనట్లు డిఎస్‌పి తెలిపారు. నిందితునిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు వెల్లడించారు. నిందితుని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు సిఐ మురళీధర్ తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - కడియం

ఒక వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు కడియం సిఐ బి.తులసీధర్ తెలిపారు. కడియం గ్రామానికి చెందిన చల్లా కొండరాజు అదే గ్రామానికి చెందిన ఒక వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఆమె భర్తపై దాడి చేసినట్లు వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడును చల్లా కొండరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం సుంకరపాలెం చెక్ పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఇబి ఎస్ఐ ఎం.రామస్వామి తెలిపారు. వారి వద్ద నుంచి 13 లీటర్ల మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



వృక్షాన్ని నరికిస్తున్న పోలీసులు

నేల కూలిన భారీ వృక్షం

ప్రజాశక్తి - కోటనందూరు

గత మూడు రోజుల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షం, ఈదురుగాలులకు తుని-నర్సీపట్నం ప్రధాన రహదారిలో భారీ వృక్షం కూలిపోయింది. దీంతో తుని - నర్సీపట్నం మధ్య వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎస్ఐ బి.శంకర్రావు తన సిబ్బందితో భారీ వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



చెక్కును అందిస్తున్న నాయకులు

బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - తాళ్లరేవు

గత ఏడాది అక్టోబర్‌లో రోడ్డు ప్రమాదానికి గురైన జార్జిపేట గ్రామానికి చెందిన పిల్ల సాయి వెంకట నాగబాబుకు రూ.30 వేల ఇన్సూరెన్స్ చెక్కును కొత్తపేట జనసేన ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాస్ శనివారం అందజేశారు. రోడ్డు ప్రమాదం లో గాయ పడిన నాగబాబు జనసేన క్రియాశీలక సభ్యత్వం కలిగి ఉండడంతో పార్టీ తరుపున రూ.30 వేల ఇన్సూరెన్స్ చెక్ వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కర్నేడి నాని, ముత్యాల జయలక్ష్మి, అత్తిలి బాబురావు, సూరంపూడి కుమార్ పాల్గొన్నారు.

కంటిపూడి కుటుంబ సభ్యులకు జ్యోతుల నవీన్ పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కంటిపూడి రామారావు తల్లి బంగారమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం పెద్ద కార్యం సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ హాజరై బంగారమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు అనంతరం వారి కుటుంబ సభ్యులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కూర్పు సాయితేజ, మండల పార్టీ అధ్యక్షులు పోతుల మోహన్రావు, గ్రామ పార్టీ అధ్యక్షులు వేలమాటి కాశి, బలంరెడ్డి రామకృష్ణ, సంకపల్లి రమేష్, ఇప్పర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కరప



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ నానాజీ

ఆరోగ్యం, అధిక వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ పంతం నానాజీ సూచించారు. శనివారం కరప మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి పెంకే శ్రీలక్ష్మీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివద్ధికి రాజకీయాలకు అతీతంగా కృషి చేద్దామని అన్నారు. తాను ఆలస్యంగా ఎంఎల్ఏగా ఎన్నికైనా 30 ఏళ్లుగా రాజకీయాల్లోనే ఉన్నానని, ప్రజా సమస్యలపై తనకు అవగాహన ఉందని పార్టీలకు అతీతంగా అధికారులను ఇతర నాయకుల్ని గౌరవిస్తూ మండల అభికృద్ధికి కృషి చేస్తానని అన్నారు. తొలుత వైద్య ఆరోగ్య, డ్రెయినేజీ, ఇరిగేషన్ తదితర శాఖలపై సమీక్షించారు. మండలంలోని అన్ని మేజర్ డ్రెయిన్ల మెయింటినెన్స్ ఒకే వ్యక్తికి కాంట్రాక్టు ఇవ్వడం వలన డ్రెయిన్లలో గుర్రపు డెక్క, తూటు తొలగించడం లేదని, పైపైన మందు పిచికారి చేసి పోతున్నారని సభ్యులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆదే కాంట్రాక్టర్ టెండరు దాఖలు చేశారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ కె.అప్పారావు, వైస్ ఎంపిపి బొమ్మెతి వీరరాఘవులు, సర్పంచులు డేగల లలిత కుమారి, మారెళ్ళ శ్రీనివాసరావు, గోపి సత్యవేణి, అడబాల సత్య, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నాయుడుకు ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి - కాకినాడ



పురస్కారాన్ని అందుకుంటున్న ఆదిత్య డైరెక్టర్ నాయుడు

ఆదిత్య డిగ్రీ మరియు పిజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు ఇండియన్ రెడ్‌క్రాస్ అవార్డును కలెక్టర్ షాన్‌మోహన్ చేతుల మీదుగా అందుకున్నారు. శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశం కలెక్టరేట్‌లో రెడ్ క్రాస్ ఛైర్మన్ వైడి.రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఉత్తమ సేవలు అందించిన వారికి ఉత్తమ సేవా పురస్కారాలు అందించారు. ఈ పురస్కారాలలో ఆదిత్య డిగ్రీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ విభాగం ఉత్తమ సేవలను అందించడంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ పురస్కారాన్ని నాయుడుకు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డిగ్రీ కళాశాలల్లో యూత్ రెడ్‌క్రాస్ వింగ్స్ ద్వారా రక్తదానం, ప్రథమ చికిత్స, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మెళుకువలు వంటి అనేక సామాజిక కార్యకలాపాలను విద్యార్థులకు తెలియజేస్తూ, వారిని సామాజిక బాధ్యత గల వ్యక్తులుగా మార్చేలా చేసిందని అన్నారు. డాక్టర్ నాయుడును ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, కళాశాలల ప్రిన్సిపల్స్, ఐఆర్‌సిఎస్ నోడల్ ఆఫీసర్ తేజేశ్వరరావు, శాఖాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

డాక్టరేట్ అందుకున్న ప్రత్యూష

ప్రజాశక్తి - గండేపల్లి



డాక్టరేట్‌ను అందుకుంటున్న ప్రత్యూష

మండలంలోని మురారి గ్రామానికి చెందిన చంద్రాల ప్రత్యూష గీతం యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకుంది. శనివారం హైదరాబాద్‌లోని గీతం యూనివర్సిటీలో నిర్వహిం చిన గ్రాడ్యుయేషన్ సెర్మనీలో ఆమె డాక్టరేట్ అందుకున్నారు. విశాఖలోని గీతం వర్సిటీలో 'ఇంప్లిమెంటేషన్ అండ్ పెర్ఫార్మెన్స్ ఇవల్యూషన్ ఆఫ్ ఎఫిసెంట్ ఆర్కిటెక్చర్ ఫర్ ఒన్ డైమెన్షనల్, టూ డైమెన్షనల్ ఫైన్‌ఇట్ ఇంపల్స్ ఫిల్టర్స్' అంశంపై ఆమె పిహెచ్‌డీ చేశారు. గీతం వర్సిటీకి చెందిన గైడ్ డాక్టర్ జేబీ సెవెంత్ లిన్ సారథ్యంలో ఆమె పీహెచ్‌డీ పూర్తి చేశారు. డాక్టర్ ప్రత్యూష హైదరాబాద్‌లోని సుమేధా ఐటీ సంస్థలో వీఎల్ఎస్ఐ డిజైన్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. ఆమె గతంలో విశాఖలోని సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ, హైదరాబాద్‌లోని గోకరాజు రంగరాజు, వీఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేశారు.

23 నుంచి ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

మండలంలో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే ఆధార్ ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ శ్యాంసుందర్ తెలిపారు శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ మండలంలోని పి.వేమవరం, నవర, చంద్రంపాలెం, ఉండూరు, అచ్చంపేట, గొంచాల, వికె.రాయపురం, మాధవపట్నం, జి.మేడపాడు, వేట్లపాలెం గ్రామాల్లో ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు ఏమైనా ఉంటే ఈ శిబిరాల్లో సరి చేయించుకోవచ్చని ఆయన తెలిపారు. అలాగే పెద్దాపురం మండల పరిధిలోని 23 గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఉషారాణి తెలిపారు. ఈ క్యాంపుల్లో ఆధార్ కార్డుల్లో పేరు, అడ్రస్సు, వయసు తదితర మార్పులు, చేర్పులు చేస్తారని చెప్పారు. 23, 24 తేదీల్లో వడ్లమూరు జడ్‌పి హైస్కూల్లో వడ్లబమూరు, జి.రాగంపేట, గోరింట, పులిమేరు గ్రామాలకు, కాండ్రకోట జడ్‌పి హైస్కూల్‌లో తూర్పు పాకలు, మరలావ, కాండ్రకోట గ్రామాలకు, కొండపల్లి జడ్‌పి హైస్కూల్లో ఆనూరు, కొండపల్లి గ్రామాలకు, 25న చంద్రమాంపల్లి జడ్‌పి హైస్కూల్లో దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి గ్రామాలకు, 25, 26 తేదీల్లో కట్టమూరు జడ్‌పి హైస్కూల్‌లో కట్టమూరు గ్రామానికి, 25న ఆర్‌బి పట్నం జడ్‌పి హైస్కూల్లో చిన్న బ్రహ్మదేవం, వాలు తిమ్మాపురం, ఆర్ బి పట్నం గ్రామాలకు, 27న చదవాడ జడ్‌పి హైస్కూల్లో ఉలిమేశ్వరం, చదలాడ, తాటిపర్తి గ్రామాలకు, జె తిమ్మాపురం ఎంపి యుపి స్కూల్లో జె.తిమ్మాపురం గ్రామానికి, ఆర్ బి కొత్తూరు ఎంపి యుపి స్కూల్లో ఆర్‌బి కొత్తూరు గ్రామానికి సంబంధించి ఈ క్యాంపులు నిర్వహించబడతాయన్నారు.

చదరంగం క్రీడను నేర్పేలా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ప్రతీ పాఠశాలలోనూ విద్యార్థులకు చదరంగం క్రీడను నేర్పేలా చర్యలు చేపట్టాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్టు ఆధ్వర్యాన ప్రముఖ చదరంగ క్రీడాకారులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, రాధాకృష్ణ లను సత్కరించారు. ఈ సంధర్భంగా డా అడ్డాల మాట్లాడుతూ మన భారతీయ ప్రాచీన క్రీడ చదరంగాన్ని ప్రతీ పాఠశాలలో పిల్లలందరికీ తప్పనిసరిగా నేర్పాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్ లయన్ అనురాధాకృష్ణ, అడబాల రత్నప్రసాద్, రెడ్డం రాజా, అనిల్, శిరీష, అడబాల సత్యనారాయణ పాల్గొన్నారు.

వరి పంటను కాపాడుకోవటానికి జాగ్రత్తలు

ప్రజాశక్తి - గండేపల్లి

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో వరి పంటపై ప్రభావం లేకుండా జాగ్రత్తలు అవసరమని పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.దయాకర్ అన్నారు. శనివారం మండలంలో వర్షాలకు నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడిలో విత్తనం చల్లిన 2, 3 రోజుల వయసులో మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని పూర్తిగా బయటకు తీసివేయాలని అన్నారు. విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారుమడి 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే తక్షణమే పూర్తిగా నీటిని తీసివేసి పంటకు గాలి తగిలేలా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ నరసింహరావు, ఎఎస్ఆర్.శర్మ, సిహెచ్.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి, విఎఎ ఎస్.నాగదుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

దాదాపు 30 ఏళ్ల పైబడి ఎన్ఎఫ్‌సిఎల్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికులకు నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్ కోరారు. శనివారం ఆయన కార్మికులతో కలిసి ఎంఎల్ఎ పంతం నానాజీని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా పంతం నానాజీ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిపిఐ కాకినాడ జిల్లా కార్యదర్శి శివకోటి రాజు, ఎన్ఎఫ్‌సిఎల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కాలా రమణ, టి.శ్రీను, కమిటీ సభ్యులు కాపు, వి.రమణ, ఈశ్వరరావు, గంగాధర్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఐఐటీలో ప్రతిభ చాటిన నవోదయ విద్యార్థి

ప్రజాశక్తి - యానాం



ఆకాష్

యానాం జవహర్ నవోదయ విద్యార్థి యు.ఆకాష్ ప్రతిష్టాత్మకమైన ఐఐటి ఖరగ్‌పూర్‌లో ఏరోస్పేస్ కోర్సులో ఎంపికైనట్లు యానాం నవోదయ విద్యాలయ వైస్ ప్రిన్సిపల్ రాజశేఖరరెడ్డి శనివారం తెలిపారు. ఆకాష్ 22-23 విద్యా -సంవత్సరంలో 10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానాన్ని పొందడమే కాకుండా రెండు సంవత్సరాలు బెంగళూర్‌లోగల దక్షిణా ఫౌండేషన్‌లో నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో విద్యనభ్యసించినట్లు తెలిపారు. ఆకాష్ ఐఐటిలో సీటు సాధించి నవోదయ యానాంకు పేరు తేవడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆకాష్ తండ్రి యు.జయప్రకాష్ స్థానిక నవోదయలో గణిత ఉపన్యాసకులుగా పనిచేస్తున్నారు. ఆకాష్ మాట్లాడుతూ తనకు ఇష్టమైన ఏరోస్పేస్ కోర్సులో సీటు రావడం ఆనందాన్ని కరిగించిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

టిడ్కో గృహ రుణ మాఫీపై అసెంబ్లీలో చర్చిస్తా

ప్రజాశక్తి - పెద్దాపురం

టిడ్కో గృహ రుణాల మాఫీపై అసెంబ్లీలో చర్చించి లబ్ధిదారులకు న్యాయం చేస్తానని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం స్థానిక వాలు తిమ్మాపురం టిడ్కో గృహ సముదాయంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి పాలనలో టిడ్కో గృహాలను నిర్మించినా, మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ఈ సందర్భంగా గృహ లబ్ధిదారులు పి.మణి, ఎ. శ్రీదేవి, నాగమణి, ఎస్.మణి తదితరులు మాట్లాడుతూ గృహ రుణాల వాయిదాలను చెల్లించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నామని, వాయిదాల కోంస బ్యాంకుల నుంచి తీవ్రమైన ఒత్తిడి ఉంటుందన్నారు. దీనిపై ఎంఎల్ఎ మాట్లాడుతూ లబ్ధిదారుల ఇబ్బందులను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, టిడిపి నాయకులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, జనసేన పట్టణ అధ్యక్షులు పోలమర శెట్టి సత్తిబాబు,ఒ బిలిశెట్టి గణేష్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, డిఇఇ ఆదినారాయణ పాల్గొన్నారు.

పవన్‌కు మద్దతుగా సభ్యత్వం తీసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రాష్ట్ర రాజకీయాల్లో నూతన ఒరవడిని సృష్టిస్తున్న పవన్ కళ్యాణ్‌కు మద్దతుగా తటస్తులు కూడా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం పొందాలని విశ్రాంతి ఇంజనీర్ పి.పార్థసారథి సూచించారు. శనివారం సర్పవరం జంక్షన్‌లో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం పొందిన పార్థసారథి మాట్లాడుతూ రాజకీయాలకు దూరంగా ఉన్న తాను నిస్వార్థంగా సేవలు అందించడానికి కృషి చేస్తున్న పవన్ కళ్యాణ్ ఆశయాలకు మద్దతుగా నిలవడానికి సభ్యత్వం స్వీకరించానని అన్నారు. జనసేన పార్టీ నగర శాఖ ఉపాధ్యక్షులు అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో మూడోరోజు పెద్ద ఎత్తున యువకులు, తటస్తులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు.

బాలయోగి ఆశ్రమాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి

ప్రజాశక్తి-ముమ్మిడివరంరూరల్

ముమ్మిడివరం భగవాన్ బాలయోగిశ్వరుల ఆశ్రమాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధిచేసేందుకు కృషి చేస్తానని అమలాపురం ఎంపి గంటి హరీష్ మాధుర్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బాలయోగిశ్వరుల ఆశ్రమాన్ని శనివారం ఎంపిగా గెలిచిన హరీష్ మాధుర్ తొలిసారి సందర్శించి బాలయోగీశ్వరుల సమాధులను దర్శించుకున్నారు. కార్యక్రమానికి ముందు ఆశ్రమ కమిటి మరియు కుటుంబ సభ్యులు ఎంపి హరీష్ కు ఘన స్వాగతం పలికారు. ఆశ్రమం మరియు ఆశ్రమానికి వెళ్ళే రహదారులను ఎంపి ల్యాడ్స్ నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి చెల్లి అశోక్, దొమ్మేటి రమణ కుమార్, కాశి రామచంద్ర రావు, చిక్కాల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులతోనే రేవుల వద్ద పంట్లు, పడవలు నడపాలి

ప్రజాశక్తి-అమలాపురం

పక్కా అనుమతుల తోనే రేవుల వద్ద పంట్లు, పడవలు నడపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శనివారం అమలాపురం కలెక్టరేట్ లో జిల్లాలో వివిధ రేవుల నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.. జిల్లా లో అధికారికంగా అనధికారికంగా 13 రేవుల వద్ద పంట్లు, పడవలు నడుపుతున్నారని అధికారులు కలెక్టర్ దృష్టి కి తీసుకొచ్చారు. కలెక్టర్ ఆర్‌మహేష్ కుమార్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టం 1994 ప్రకారం రేవుల నిర్వహణ జాయింట్ కమిటీల ఆధ్వర్యంలో జరగాలని ఆదేశించారు.. వారం రోజుల్లోగా జాయింట్ కమిటీలు లేని రేవులకు జాయింట్ కమిటీలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు.

మండలాభివృద్ధికి అందరూ కృషి చేయాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయసమావేశ మందిరంలో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంఎల్ఎ పాల్గొని మాట్లాడారు. సమస్యలపై పలు గ్రామాల ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు.

నీటమునిగిన నారుమళ్ల పరిశీలన

ప్రజాశక్తి-కాట్రేనికోన

చెయ్యేరు-2 రైతు సేవ కేంద్రంలో అమలాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ నందకిశోర్, మార్టేరు ప్రిన్సిపల్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎంవీ.కృష్ణాజి, డాక్టర్ డయాల్, డాక్టర్ ఆనంద్ కుమార్, డిఆర్‌సి ఎఒ మనోహర్, మండల ఎఒ కె. ప్రవీణ్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఆదర్శ రైతులతో సమావేశం శనివారం నిర్వహించారు. అనంతం కాట్రేనికోన -3 వేట్ల పాలెం గ్రామము నందు నీట మునిగిన వరి నారుమడులు, నాట్లు వేసిన రైతులు పొలాలను శాస్త్రవేత్తలు సందర్శించారు. ఊడ్చిన వెంటనే మరియు పిలక దశలో ముంపునకు గురి అయినట్లైతే నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పైపాటుగా ఒక ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను బూస్టర్ డోస్ గా వేసుకోవాలన్నారు. నీరు పూర్తిగా తీయలేని పక్షంలో ఆకుపై 2 శాతం యూరియా లేదా పోటాషియం నైట్రేట్ ను పిచికారి చేయుటవలన పైరు త్వరగా పుంజుకుంటుందన్నారు. కార్యక్రమంలో విఎస్‌కె మనోజ్, రైతులు పితాని సత్యనారాయణ, ఓలేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వారికి ఇన్సూరెన్స్ అందజేత

ప్రజాశక్తి -అమలాపురం

ప్రమాదవశాత్తు గాయపడిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులకు కొత్తపేట ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ఇన్సూరెన్స్ మొత్తాన్ని శనివారం అందించారు. అమలాపురం రూరల్ మండలం జనుపల్లి గ్రామానికి చెందిన గునిశెట్టి వరప్రసాద్ రూ.19 వేలు, చిందాడగరువు గ్రామానికి చెందిన మండేల సూర్యప్రకాశరావుకు రూ.30వేలు, పేరూరు పంచాయతీ తోట్లపాలెంకు చెందిన దొంగా వీర సాయికుమార్ రూ.25,013 బీమా చెక్కులను అందించారు. కార్యక్రమంలో అమలాపురం నియోజకవర్గ నాయకులు నల్లా శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ యాళ్ళ సతీష్, రూరల్ అధ్యక్షులు లింగోలు పండు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-కొత్తపేట

వైద్య విధాన పరిషత్ స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ మృతి చెందిన జగత శ్రీనివాసరావుకు ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది శనివారం ఘనంగా నివాళులర్పించారు. సుదీర్ఘకాలంగా ఆస్పత్రిలో సహాయకునిగా పనిచేస్తున్న శ్రీనివాసరావ గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ జి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆస్పత్రి వైద్యులు,సిబ్బంది శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో అమలాపురం ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మధుకర్, స్థానిక ఆసుపత్రి వైద్యులు, స్టాఫ్ నర్సులు ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువలో కళాశాల బస్సు బోల్తా

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఓడలరేవు బివిసి ఇంజినీరింగ్ కళాశాల నుండి విద్యార్థులను బస్సులో ఎక్కించుకుని శనివారం సాయంత్రం తిరిగి వెళుతున్న బస్సు సరిపల్లి గ్రామం వచ్చేటప్పటికి స్టీరింగ్ రాడ్ విరిగిపోయి పంట కాలువలోకి బోల్తా పడింది.ప్రమాద సమయంలో బస్సులో ఉన్న ఆరుగురు విద్యార్థులను గ్రామస్తులు అద్దాలు పగలగొట్టి క్షేమంగా బయటకు తీశారు. స్వల్ప గాయాలతో విద్యార్థులు బయటపడ్డారు. జిల్లావ్యాప్తంగా తుఫాను ప్రభావంతో శనివారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించిన జిల్లా కలెక్టర్ ఆదేశాలను ధిక్కరించి విద్యాసంస్థలను నడపడం వలన ఈ ప్రమాదం జరిగిందని విద్యార్థి ప్రజా సంఘాలు మండిపడ్డాయి.దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

కబడ్డీ పోటీలకు కిట్స్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్ఇ 3వ ఏడాది చదువుతున్న కె. మనోహర్ జూనియర్ ఇండియా కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడని కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. కర్నూలులో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన మనోహర్ రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికయ్యాడన్నారు. అనంతరం హైదరబాదులో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జూనియర్ ఇండియా కబడ్డీ ప్రాపబుల్స్‌కు ఎపి తరపున ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా మనోహర్‌ను కళాశాల ఛైర్మన్ బేతినిడి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సర్వరామేశ్వరుడు, ఇఒ జెన్నీబాబు,పెద్ద కాపు, పిడి స్వామి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



చెరువును తలపిస్తున్న రహదారి

రహదారికి మోక్షం ఎప్పుడు..?

ప్రజాశక్తి - ఏలేశ్వరం

గోతులతో చెరువులను మరిపిస్తున్న ఏలేశ్వరం - జె. అన్నవరం ఆర్అండ్‌బి రహదారికి మోక్షం ఎప్పుడో అర్థం కాని పరిస్థితి నెలకుంది. ఏజెన్సీ ముఖ ద్వారమైన ఏలేశ్వరానికి నిత్యం వందలాది వాహనాలు గిరిజన ప్రాంతాల నుంచి ఇదే రహదారిలో వస్తుంటారు. గతంలో ఏలేశ్వరం సంతకు గురువారం వందలాది మంది గిరిజన, గిరిజనేతరులు ఏలేశ్వరం వచ్చేవారు. ఈ రహదారి శిథిలావస్థకు చేరడంతో దూరాభారమైన గోకవరం మీద నుంచి రాజమహేంద్రవరం వెళ్లాల్సివస్తుంది. దీంతో ఏలేశ్వ రంలో వ్యాపారాలు 90 శాతం పైగా తగ్గిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇదే రహదారిపై ప్రయాణించే అంబులెన్సులు సైతం మరమ్మతులు గుర్తై నిలిచిపోయేవి. ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతన్నారు.

సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా బోధన

ప్రజాశక్తి-రామచంద్రపురం

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యా బోధన మార్పు చెందాలని దాని కోసం ఉపాధ్యాయులు మరింత నైపుణ్యాన్ని పెంచుకోవాలని డిఇఒ కమల కుమారి అన్నారు. రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు హైస్కూల్లో జరుగుతున్న టీచ్ బుల్ అబ్జర్వర్ ట్రయినింగ్ ప్రోగ్రాం శనివారం ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిసి మధుసూదన్ రావు పాల్గొన్నారు. డివైఇఒ ఎస్.నరసింహ ఫణి మాట్లాడుతూ ఉపాధ్యాయుల శిక్షణ తొమ్మిది రోజులపాటు కొనసాగు తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మానిటరింగ్ అధికారి రాంబాబు, ఎంఇఒ మనపూడి శ్రీనివాసు, ఎంఇఒ-2 నాగేశ్వరి, మాస్టర్ ట్రయినర్ చొప్పెల్ల వెంకన్న బాబు, చక్రవర్తి, రాజు, మూర్తి సాయి సుధా తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని చింతలూరుకు చెందిన యువకుడు వీరి మురళీకృష్ణ(24) ఇటీవల తన స్నేహితులతో కలిసి మోతుగూడెం పర్యాటక ప్రాంతాలను దర్శించడానికి వెళ్లాడు. అయితే లోయర్ సీలేరు ప్రాజెక్టు ఫోర్ బె పవర్ కెనాల్లో (పుష్పబ్రిడ్జి వద్ద) ప్రమాదవశాత్తు జారిపడి అతను మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు శనివారం పార్టీ శ్రేణులతో విచ్చేసి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మురళీకృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఎల్ఎ బండారు సత్యానందరావు వెంట టిడిపి నాయకులు తదితరులు ఉన్నారు.